క్లుప్తంగా

మదనపల్లె డివిజన్‌లో వర్షం

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్‌లో శనివారం రాత్రి వర్షం కురిసింది. ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వర్షంతో ఊరట చెందారు. మదనపల్లెలో 26.0, కురబలకోట 4.0, బి.కొత్తకోట 8.4, పిటీఎం 3.0, తంబళ్లపల్లె 3.0, ములకలచెరువు 9.2, వాల్మీకిపురం 7.4, కలికిరి 47.0, పెద్దమండ్యం 19.8, రామసముద్రం 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

21న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. గిరి ప్రదక్షణకు రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు నడపనున్ననట్లు పేర్కొన్నారు. రాను, పోను చార్జీలు రూ.805 చెల్లించాలన్నారు. ప్రయాణికులు టిక్కెట్ల కోసం 7382875034, 73828676638, 9440249483ను సంప్రదించాలని కోరారు.

ఉలవల గంగమ్మ ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఉలవల గంగమ్మ

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల గ్రామంలో వెలసిన శ్రీ ఉలవల గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులకు మల్లికార్జుననాయుడు, సాగర్‌రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కౌంటింగ్ రోజున పటిష్ట బందోబస్తు

పెద్దతిప్పసముద్రం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ నెల 4న వెలువడనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మకమైన గ్రామాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని టి.సదుం, పులికల్లు, రాపూరివాండ్లపల్లి, రంగసముద్రం, పీటీఎం, కాట్నగల్లు, మల్లెల గ్రామాల్లో పోలీస్ పికెట్‌తో పాటు ప్రత్యేక పోలీసుల నిఘా విభాగం పర్యవేక్షిస్తుందన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి 104 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రజలతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు బస్సు సర్వీసు నడపనున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండను సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి ఊరేగింపు

పీలేరు : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వీరాంజనేయస్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక సదుం మార్గంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో రెండు రోజులుగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని చాందినీబండిలో ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో పీలేరు పట్టణ పుర వీధులలో ఊరేగింపు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్న తిరునాల



ములకలచెరువు: మండలంలోని బురకాయలకోటలో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి తిరునాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



అబాకబస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

- గ్రంథాలయశాఖ వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన
- మెలకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులు.. గతంలో ఈ మాటంటే అమ్మమ్మ వాళ్ల ఇంటికో, పిక్‌నిక్‌లకో విద్యార్థులు క్యూ కట్టేవారు. కానీ ప్రస్తుతం తమ చలనకౌశాలాలకు పదును పెడుతూ గ్రంథాలయశాఖ నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాల్లో సత్తా చాటుతున్నారు. డ్రాయింగ్, రంగులు వేయడం, నాట్యం, పుస్తక పఠనం, క్యారమ్స్, సంగీత సాధన చేస్తూ బహుళ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ శిబిరాలను విజయవంతం చేస్తున్నారు గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి మంచి స్పందన లభిస్తోంది. మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణకు సుమారు 80 మందికిపైగా విద్యార్థులు వస్తున్నారు. ఈ శిబిరం గత నెల 15న ప్రారంభమై జూన్ 9 వరకు కొనసాగనుంది. ఇందులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిక్షకులు సూచనలిస్తున్నారు. విద్యార్థుల్లో తెలుగులో పట్టు కోసం ప్రసాద్‌శర్మ తెలుగు పద్యాలు, వాటి అర్థాలు వివరిస్తున్నారు. ప్రముఖ రచయిత వి.ఎస్.నాగరాజు చిన్న పిల్లలకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. బొమ్మలు ఎలా గీయాలి, రంగులు వేసే విధానం వివరిస్తున్నారు. రిటైర్డు లెక్చరర్ రెడ్డప్ప ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషు, ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, కథలు, మానవీయ విలువలు గురించి తెలియజేస్తున్నారు. సరస్వతి చిన్నారులకు భరత నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు.అబాకబస్ గురించి వినోద్‌కుమార్ వివరిస్తున్నారు.

చిత్రలేఖనంపై ఆసక్తి



చదువుతో పాటు చిత్రలేఖనంపై ఎంతో ఆసక్తి ఉంది. ఖాళీ సమయాల్లో పలు రకాల చిత్రాలను వేస్తుంటాను. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిబిరానికి వస్తున్నాను. వేసవి సెలవుల్లో చిత్రాలు వేయడంలో మెలుకువలు నేర్చుకుంటున్నా. నేను వేసిన బొమ్మలు బాగున్నాయని టీచర్లు మెచ్చుకుంటున్నారు.

-శ్రీకీర్తన, 6వ తరగతి, మదనపల్లె

క్రమం తప్పకుండా హాజరవుతున్నా



గ్రంథాలయంలో పుస్తక పఠనంతో పాటు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. పాటలు నేర్పడంతో పాటు పుస్తకపఠనం వంటి ఇతర అంశాలపై ఆసక్తి చూపుతున్నా. సెలవులు వృథా కాకుండా సద్వినియోగం చేసుకుంటున్నా. క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరవుతున్నా. ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

-సాయిలిఖిత్, 8వ తరగతి, మదనపల్లె

మంచి ఆదరణ



వేసవి శిబిరానికి మంచి ఆదరణ లభిస్తోంది. రిసోర్సుపర్సన్లు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు కూడా గ్రంథాలయానికి రావడం వల్ల వారిలో పఠనాశక్తి పెరుగుతుంది. సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మల్టీ స్కిల్స్ పెంచుకునేందుకు ఇది మంచి అవకాశం.

-వసంతకుమారి, గ్రంథాలయాధికారి

మదనపల్లెలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మదనపల్లె: ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో పెట్టుకుని ఆదివారం మదనపల్లెలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ వలిబాషు, టు టౌన్ సిఐ యువరాజ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బెంగళూరు బస్టాండు నుంచి ఆర్ ఆర్ స్ట్రీట్, చెంబకూరు రోడ్డు, కమ్మవీధి, శాస్త్రిరివీధి, నెహ్రూబజార్, అప్పారావువీధి,సైదాపేట ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్‌తో పాటు సెక్షన్ 144, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండరాదని సీఐలు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య, హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండవగా పాలేటమ్మ తిరునాల

చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామంలో వెలసిన పాలేటమ్మ తిరునాల శనివారం రాత్రి కనుల పండువగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో దాదాపు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి జంతుబలులు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్స్, చెక్కభజనల నడుమ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న వారు అమ్మవారికి చాందినీబండ్లు కట్టారు. శనివారం రాత్రి ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ఇదంతా అమ్మవారి కృపతోనే జరిగిందని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీలో వెలసిన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిత్య అన్నదానంతో సాయంత్రం వరకూ భజనలు, హనుమాన్ కీర్తనలు ఆలపించారు. రాత్రి వర్షం ఆగిన అనంతరం కోళాటం, జక్కీక వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వర్షం కారణంగా ఆలస్యమైనందున ఆదివారం ఉదయం వివిధ గ్రామాల నుంచి వచ్చిన 4 చాందినీ బండ్లు ఆలయ ప్రదక్షణ చేశాయి. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పంచముఖ అంజనేయస్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

26 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఆదివారం కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పరిధిలోని పలువురు కంటి రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవిలతో కూడిన వైద్య బృందం కంటి పరీక్షలు చేశారు. 26 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్లు నిర్వహించిన 35మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలను అందజేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు స్వరూప్‌గుప్తా, శివప్రసాద్‌రెడ్డి, చెన్నూరు అన్వర్‌బాషా, శివరామిరెడ్డి, జయరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బందిలు పాల్గొన్నారు.

గంగమ్మా.... చల్లంగ చూడమ్మా



దీలు, బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన బసినికొండ ప్రజలు ఆదివారం చిత్తూరు రోడ్డులోని కోటి కోర్కెలు తీర్చే కనుమలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి దీలు,బోనాలు సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాని, వర్షాలు కురవాలని కోరుతూ బసినికొండ నుంచి మహిళలు దీలును నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయం చేరుకున్నారు. నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి చీర, రవికెలను సమర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, స్థానికులు కృష్ణమూర్తి, పెద్ద ఆంజనేయులు,చిన్న ఆంజనేయులు, సూరి,లచ్చి, హేమంత్, అరుణమ్మ, రెడ్డమ్మ, దీప, హేమ, రాధమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రాయచోటి అర్బన్ : అనాథ శవానికి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు రాయచోటి మున్సిపల్ రెవెన్యూ అధికారి మల్లికార్జున. వివరాలలోకెళితే.. ఎండతీవ్రత భరించలేక వృద్ధ యాచకురాలు(65) ఆదివారం మృతిచెందింది. సమాచారం అందుకున్న మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్, పోలీసు, మానవత సేవా సంస్థల సహాయ సహకారాలతో యాచకురాలి మృతదేహానికి అన్ని తానై హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 140కి పైగా అనాథ మృతదేహాలకు వారివారి ఆచార సాంప్రదయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించానన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సంబేపల్లె ఏఎస్‌ఐ బాషా, కానిస్టేబుల్ రాజేంద్రతోపాటు మున్సిపల్, మానవత సంస్థల సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

డీఎస్‌డీఓ గౌస్ బాషా



శిక్షణ తీసుకున్న బాస్కెట్ బాల్ క్రీడాకారులు

వాల్మీకిపురం: బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ గౌస్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ వాల్మీకిపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తోందన్నారు. తాను జిల్లాలో ఎన్నో వేసవి శిక్షణ శిబిరాలు సందర్శించడం జరిగిందని, కానీ వాల్మీకిపురం జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం క్రమశిక్షణతో నిర్వహించారని, క్రీడాకారులు కూడా బాస్కెట్ బాల్ క్రీడలో మంచి పట్టు సాధించడం పట్ల అభినందించారు. బాస్కెట్ బాల్‌కు మంచి వేదిక దొరకడం ఈ ప్రాంత యువతకు మంచి వరం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రవిచందర్ మాట్లాడుతూ చింతల శ్రీధర్ రెడ్డి సహకారంతో క్రీడాకారులకు నెల రోజుల పాటు ఉచితంగా బాస్కెట్ బాల్ శిక్షణ ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం అందించామన్నారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రవిచందర్, సుబ్రమణ్యం, సాయిభార్గవ్, పిడి ఉషారాణి, కోచ్‌లు అంజిబాబు, కిరణ్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వివాదస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు



వివాదస్పద స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

మదనపల్లె: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ సర్వే నంబర్ 529, 617/2, 617/ 4 విస్తీర్ణంలోని స్థలం హైకోర్టు పరిధిలో ఉన్నందున ఎటువంటి ఆక్రమణలు, నిర్మాణాలు చేయవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం పైసర్వే నంబర్లలో ఓ వ్యక్తి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు స్థానికులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వారు బోర్డును ఏర్పాటు చేశారు. వివాదస్పద స్థలంకు సంబంధించి 145 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి కట్టడాలు చేయరాదని హెచ్చరించారు. అతిక్రమించి నిర్మాణాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వెంకటస్వామి సేవలు అభినందనీయం



వెంకటస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎగ్జామినర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన వెంకటస్వామి సేవలు అభినందనీయమని వాల్మీకిపురం, పీలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు గురు అరవింద్, గాయత్రి అన్నారు. ఆదివారం స్థానిక కోర్టు ఆవరణంలో జరిగిన వెంకటస్వామి పదవీ విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన వెంకటస్వామి 1988లో జ్యుడిషియల్ శాఖలో చేరి 36 సంవత్సరాల పాటు సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది విజయ్ కుమార్, మదనపల్లి సూపరింటెండెంట్ జయ చంద్రబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గర్నిమిట్ట యల్లమ్మ

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయంలో మరుపొంగళ్ల కార్యక్రమంలో భాగంగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేశారు. బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తాదులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు పూజలు

మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో వెలసిన నల్లగంగమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి నల్లగంగమ్మ తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భారీ వర్షానికి నేలకొరిగిన రథం షెడ్డు



సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద నేలకొరిగిన రథం షెడ్డు

కలకడ : కలకడలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బొప్పాయి, టమాట, పంటలు దెబ్బతిని, కొన్ని చెట్లు నెలకొరగాయి. స్థానిక శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి ఆయలంలో ఆలయ కమిటీ సభ్యులు పురాత ప్రతిష్టను ప్రతిబింబించేలా చేపట్టిన రథం షెడ్డు గాలివానకు నేలకొరింగింది. స్వామివారి ఊరేగింపు ఉత్సవాలకు తయారు చేసే రథం కోసం 40 అడుగుల ఎత్తుగల షెడ్డును ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి వీచిన గాలికి నేలకొరిగింది. అయితే భక్తులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, వైర్లు, సర్వీసులను ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు.

గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పీలేరు రూరల్ : కౌంటింగ్ రోజున గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలో స్పెషల్ పోలీసులచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మంగళవారం రాయిచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్టు అమల్లో ఉంటుందన్నారు. లాడ్జీల్లో, కల్యాణ మండపాల్లో గుమికూడరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎస్‌ఐ నరసింహుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులతో అతిథులు

తంబళ్లపల్లె: ఆటలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం చేకూరుతుందని మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య తెలిపారు. ఆదివారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ స్పోర్ట్ క్యాంప్ ముగింపు సమావేశానికి ఆయన హాజరయ్యారు. కోచ్ మహమ్మద్ యూసఫ్ నెల రోజుల పాటు ఈ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. వంద మందికిపైగా విద్యార్థులు, క్రీడాకారులు శిక్షణ పొందారు. క్రీడా కారులకు దుస్తులు వితరణ చేసిన దాతలను అభినందించారు. ముఖ్య అతిథులు డీఎస్‌డీఓ గౌస్ బాషా, ఎస్‌ఐ వెంకట్ శివకుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, భద్రయ్య, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ.. కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ కరుణించమ్మా.. అంటూ భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.